క్లుప్తంగా

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో 1993–94కి చెందిన ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు శ్రీనివాస్‌రెడ్డి, తండా సాంబయ్య, నారాయణ, సత్తయ్య, విజయలక్ష్మి, రవీందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తునికాకు టెండర్లు నిర్వహించాలి

గూడూరు: ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ, గిరిజన దళిత ఇతర పేదలకు ఆదాయాన్ని ఇచ్చే తునికాకు టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) సహాయ కార్యదర్శి జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో బొడిగ వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ కమిటీ నాయకుడు ఈరెల్లి మల్లేష్, కొమురుమల్లు, వెంకట్రామనర్సయ్య, బుచ్చిరాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

రమేష్‌కు డాక్టరేట్



డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడకు చెందిన సాంపంగి రమేష్ ఘనా దేశంలోని మైల్స్ లీడర్‌షిప్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. సామాజిక సేవతోపాటు స్వచ్ఛమైన వాతావరణం, ప్రకృతికి చేయూతనిచ్చే వ్యాపారాలు చేస్తూ అంతర్జాతీయ గుర్తింపు పొందిన రమేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు.

పీఆర్‌సీ ప్రకటించడం అభినందనీయం

తొర్రూరు: ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం అభినందనీయమని మున్సిపాల్ చైర్మన్ మంగళపెల్లి రామచంద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. ఆదివారం డివిజన్‌కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్, ఆర్టీసీ కార్మికులతో కలిసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపాల్ వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, సురేష్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సోమానాయక్, సమ్మద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తొర్రూరు రూరల్: పట్టణంలోకి 16వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు మూల శ్రీనివాస్, నాగయ్యతోపాటు మరికొంత మంది పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు సోమయ్య, అనిల్, వినోద్, సురేష్ పాల్గొన్నారు.

మైసమ్మఆలయంలో పూజలు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని రెడ్యాల గ్రామంలో అమావాస్య సందర్భంగా శ్రీబంగారు మైసమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, మహబూబాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డుపల్లి ఉపేంద్రరంజిత దంపతులు, కొమరమ్మ, మాధురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ ఆరో తరగతి, రుక్మాపూర్ ఇంటర్ జూనియర్ సైనిక్ కళాశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ జి.జయలక్ష్మి ఆదివారం తెలిపారు. 182 మంది విద్యార్థులకు 173 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇంటర్‌లో 74 మంది విద్యార్థులకు 69 మంది హాజరైనట్లు తెలిపారు.

ప్రగతిశీల శక్తులు ఏకం కావాలి

చిన్నగూడూరు: దేశంలో మత, ప్రాంతీయ విద్వేషాలు రగిలించి రాజకీయ లబ్ధి పొందే శక్తులను ప్రతిఘటించడానికి ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గంజి శేషాద్రి రెడ్డి, రామడుగు బ్రహ్మం, దొంతు స్టాలిన్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య @మోడల్ స్కూల్

- నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష



మోడల్ స్కూల్

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పేద, గ్రామీణ విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు కార్పొరేట్‌కు దీటుగా ఉచిత విద్యను అందించేందుకు మోడల్ స్కూళ్ల ఏర్పాటు చేశారు. అంతేకాక విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన వసతిని కల్పిస్తూ వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తప్పిస్తున్నది. మోడల్ స్కూల్‌ల్లో చదివే బాలికలకు హాస్టల్ వసతిని కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 18 మండలాలకు 8 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. అయితే ప్రస్తుత విద్యాసంవత్సరానికి 2024–25 మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 11వరకు దరఖాస్తులు స్వీకరించి, ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నారు.

అర్హతలు ఇవే..

విద్యార్థుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం అయితే రూ.1.50వేలు, పట్టణ ప్రాంతం రూ.2లక్షలకు మించకూడదు. మోడల్ స్కూల్ మండలానికి చెందిన విద్యార్థులు అయి ఉండాలి. లేదంటే కనీసం ఆ మండల పరిధిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో రెండేళ్లు చదివి ఉండాలి. ఆరో తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు ఆగస్టు 31 నాటికి 10 ఏళ్ల వయసు, 7వ తరగతికి 11ఏళ్లు, 8వ తరగతికి 12 ఏళ్లు, 9వ తరగతికి 13 ఏళ్లు, 10వ తరగతికి 14 ఏళ్ల వయసు నిండి ఉండాలి.

ఎంపిక ఇలా..

అర్హత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లిష్‌లో ఉంటుంది. తెలుగు, గణితం, పర్యావరణ శాస్త్రం, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్ నుంచి 100 ప్రశ్నలు ఉంటాయి. ఆరో తరగతికి సంబంధించిన ప్రతీ మోడల్ స్కూల్‌లో 100 సీట్లను భర్తీ చేస్తారు. 7నుంచి 10 వ తరగతులకు సంబంధించి ఆయా స్కూల్‌ల్లో తరగతుల్లో ఉన్న ఖాళీల ఆధారంగా భర్తీ చేయనున్నారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు ..

2024–25 విద్యా సంవత్సరానికి మోడల్ స్కూల్‌లో ప్రవేశం పొందాలనుకున్న విద్యార్థులు telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125, ఇతరులకు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని ఆసక్తి కలిగిన విద్యార్థులు మోడల్ స్కూల్‌ల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను, భోజనాన్ని, ఇతర సదుపాయాలను అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు నేటితో గడువు ముగియనుంది.

\- పి.రామారావు, డీఈఓ

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్: సైబర్ నేరాలు జరగకుండా ప్రతిరోజు ప్రజలకు అవగాహన కల్పించాలని సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. సైబర్ నేరాలపై టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని ప్రతీ పోలీస్‌స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌ను సైబర్ వారియర్‌గా నియమించి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సైబర్ నేరానికి సంబంధించిన దరఖాస్తు పోలీస్‌స్టేషన్‌కు రాగానే వెంటనే స్పందించి కేసు నమోదు చేయాలన్నారు. బాధితులు హెల్ప్ లైన్ నంబర్ 1930 సమాచారం అందజేయడం ద్వారా బాధితులకు సత్వరమే అందించే న్యాయంపై స్టేషన్ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించారు. బాధితులు నష్టపోయిన డబ్బు తిరిగి వచ్చేందుకు పోలీస్ అధికారులు జరపాల్సిన ఉత్తర ప్రత్యుత్తరాలకు సంబంధించి అంశాలపై తెలియజేశారు.ఈ సమావేశంలో సైబర్ క్రైం ఎస్సై కరుణాకర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కేసముద్రం: 2002-03 బ్యాచ్ విద్యార్థులు



గూడూరులో..

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ ఆవరణలో ఆదివారం 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

కేసముద్రం: మండల కేంద్రంలో కేసముద్రం స్టేషన్ జెడ్పీ హైస్కూల్ 2002–03 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు.

బీఆర్‌ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

నర్సింహులపేట: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని కవితను అధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని దేవస్థానం ఆవరణంలో ఆదివారం నిర్వహించిన మండలస్థాయి బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 14వ తేదీన ఎంపీ ఎన్నికలపై మండల కేంద్రంలో నిర్వహించనున్న సన్నాహక సమావేశంను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. రాబోయో రోజులు బీఆర్‌ఎస్‌వే అన్నారు. రాబోయో రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఉద్యమించాలన్నారు. మండలంలో కొందరు పార్టీ మారుతున్నారనే ప్రచారం జరుగుతుందని, ఎమ్మెల్యే కార్యకర్తలు రెడ్యా దృష్టికి తీసుకరావడంతో, పార్టీ మారే వారిని బతిమిలాడేది లేదన్నారు. ఉన్న వారే నిజమైన కార్యకర్తలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర రెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు మైదం దేవేందర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామంలోగల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, జాటోత్ హరీశ్‌నాయక్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా విద్యాభివృద్ధికి 'పూలే' కృషి



మహబూబాబాద్ అర్బన్: సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సిద్ధోజు కవిత



మహబూబాబాద్ రూరల్: సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



తొర్రూరు: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



డోర్నకల్: నివాళులర్పిస్తున్న నాయకులు



గార్ల: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న సదానందం

భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి, విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మహిళా విద్యాభివృద్ధి కోసం మొట్టమొదటి పాఠశాల ఏర్పాటు చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి కృషి చేసిన ధైర్యశాలి అని ఆమె సేవలను కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. - సాక్షి నెట్‌వర్క్

పార్టీలో చేర్చుకుంటే రాజీనామా చేస్తాం..



దంతాలపల్లి: మాట్లాడుతున్న భట్టునాయక్

దంతాలపల్లి: బీఆర్‌ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటే రాజీనామాలకు సిద్ధంగా ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భట్టు నాయక్ తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాలులో మండల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు పదేళ్ల అవినీతికి పాల్పడి కేసుల మాఫీ కోసమే కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకోవద్దని తీర్మానం చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యాదర్శి కొమ్మినేని సతీష్, ఎంపీటీసీ నెమ్మది యాకయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శి సాధు లింగరెడ్డి, నాయకులు కసిరెడ్డి నవీన్‌రెడ్డి, పాన్నోటి బాలాజీ, గురుపాల్ రెడ్డి, కొమ్ము వాసు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి రానివ్వొద్దు

మరిపెడ రూరల్: అవినీతిలో కూరుకపోయిన ఆ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్‌లోకి రానివొద్దని వీరారం కాంగ్రెస్ పార్టీ నాయకులు హరిసింగ్, బుర్ర నవీన్, జెట్టి రాములు అన్నారు. కార్యక్రమంలో నాయకులు జెట్టి రాములు, రాంచంద్రునాయక్, బుర్ర యాదగిరి, సైదులు, కేలోతు వెంకన్న, భూక్య మంగీలాల్ పాల్గొన్నారు.

అమిత్‌షా సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాచర్ల నవీన్

మరిపెడ: మూడోసారి మోదీని గెలిపిద్దామని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మాచర్ల నవీన్ అన్నారు. మరిపెడలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో దేశం అన్నిరంగాల్లో ముందుడుగు వేసి ప్రపంచంలోనే ఐదో స్థానంలో ఉందన్నారు. ఈనెల 12న హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప సమ్మేళన సభకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వస్తున్న సందర్భంగా సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు బింగి రమేష్, గగాధర్, రజనికాంత్‌గౌడ్, మధుయాదవ్, ఎడెల్లి సుమన్, లక్ష్మణ్, బావుసింగ్ సాయి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీకి వక్ఫ్‌బోర్డు అనుమతి లేదు

డోర్నకల్: ఇటీవల కొంతమంది ప్రకటించుకున్న మసీదు కమిటీకి వక్ఫ్‌బోర్డు అనుమతి లేదని ఉమ్మడి వరంగల్ జిల్లా మైనారిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ కన్వీనర్ ఎంఏ వాజీద్ తెలిపారు. డోర్నకల్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసిన కమిటీ చెల్లదని తెలిపారు. రంజాన్ పండుగ పూర్తయిన తరువాత నూతన కమిటీని ఏర్పాటు కానున్నట్లు వాజీద్ పేర్కొన్నారు. సమావేశంలో జాఫర్, ఖాసీమ్, షకీలుల్లా, జావిద్, ఫెరోజ్ పాల్గొన్నారు.

మరమ్మతులు మరిచారు?

- వరదతో దెబ్బతిన్న వైకుంఠధామం, వర్మీ కంపోస్ట్ యార్డు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



వైకుంఠధామాన్ని ముంచెత్తిన వరద (ఫైల్)



వరదతో ధ్వంసమైన వైకుంఠధామం, వర్మీ కంపోస్ట్ యార్డు

డోర్నకల్: మండలంలోని చాప్లాతండా గ్రామపంచాయతీ పరిధిలోని మున్నేరువాగు ఒడ్డున నిర్మించిన వైకుంఠధామం, వర్మీ కంపోస్ట్ నిర్మాణాలు గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. మున్నేరువాగు ఆనకట్టకు చాప్లాతండా వైపు వరద ప్రవాహం భారీగా రావడంతో సపోర్ట్ కట్టకు గండి పడి వరద వైకుంఠధామం, వర్మీ కంపోస్ట్‌ను ముంచెత్తింది. భారీగా వరద రావడంతో వైకుంఠధామం ప్రహరీ ఫెన్సింగ్, ఇనుప గేటు కొట్టుకుపోయింది. బర్నింగ్ స్టాండ్లు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదికి కింది భాగంలోని ఫ్లోరింగ్ పూర్తిగా ధ్వంసమై రాళ్లు తేలాయి. వర్మి కంపోస్ట్ యార్డు అడుగు భాగం పూర్తిగా వరదలో కొట్టుకుపోయింది. వరదతో అడుగుభాగం పూర్తిగా ధ్వంసమవడంతో బండరాళ్లు తేలి నడవడానికి వీలు లేని పరిస్థితి నెలకొంది.

ధ్వంసమై తొమ్మిది నెలలు..

వరద ప్రవాహంతో వైకుంఠధామం, వర్మీ కంపోస్ట్ యార్డు ధ్వంసమై తొమ్మిది నెలలవుతున్నా అటు అధికారులు గాని, ఇటు గ్రామపంచాయతీ పాలకవర్గం కాని పట్టించుకోవడం లేదు. రూ.12.6లక్షల నిధులతో వైకుంఠధామం, రూ.2.5లక్షలతో వర్మీ కంపోస్ట్ యార్డును నిర్మించారు. వీటికి ఎలాంటి మరమ్మతులు చేయకుండా ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించడం గమనార్హం. ప్రభుత్వం మారడం, సర్పంచుల పదవీకాలం మారడంతో మరమ్మతుల పనులకు మోక్షం కలగడం లేదు. వీటి మరమ్మతులకు గ్రామపంచాయతీలో నిధులు లేవని చాప్లాతండా పంచాయతీ కార్యదర్శి సంపత్ తెలిపాడు. అధికారులు స్పందించి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

వైద్యశిబిరం

మహబూబాబాద్ రూరల్: ప్రతీ ఒక్కరూ 6నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని హైమ గార్డెన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు వంకాయలపాటి లెనిన్ బాబు, చల్లగుండ్ల రాజేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో కోశాధికారి విశ్వనాథం, వెంకటేశ్వర్లు, బిక్కి వెంకటేశ్వర్లు, శ్రీధర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

కురవి: మండల కేంద్రంలో నేడు(సోమవారం) ఉమ్మడి కురవి మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు తోటలాలయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడానికి మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ హాజరవుతారని తెలిపారు.

ఊరేగింపు

దంతాలపల్లి: మండలంలోని రేపోణి గ్రామంలో ఆదివారం శ్రీపార్వతి సమేత భవానిశంకర ఊరేగింపు యాత్ర ప్రత్యేక రథంపై కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకటరమణ, సత్యనారాయణ, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

గార్ల: దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నేడు దివ్యాంగుల చలో మహబూబాబాద్‌ను జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు జి.సక్రు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దివ్యాంగులు ధర్మయ్య, కిషన్, భీమా, మోహన్, మాన్‌సింగ్, మోహన్, వీరన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడలు

నర్సింహులపేట: నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో రాజీవ్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్‌స్థాయి కబడ్డీ క్రీడలు మూడోరోజు ఆదివారం కొనసాగాయి.

కవితను గెలిపించాలి

గూడూరు: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న మాలోతు కవిత గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ వీరన్న, నరసింహానాయక్, ఎంపీటీసీ కిషన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెద్దవంగర: మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.15లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాడిశెట్టి సైదులు, బీసు హరికృష్ణ, కొడకంటి యాకయ్య పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కేటాయించడంపై హర్షం

బయ్యారం: మహబూబాబాద్ ఎంపీ టికెట్‌ను మాజీ మంత్రి బలరాంనాయక్‌కు కేటాయించడపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచారు.

ఏప్రిల్ 19నుంచి గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఏర్పడి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏప్రిల్ 19, 20, 21న గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సమావేశ గౌరవ అధ్యక్షుడు బియ్యాల దేవేందర్ రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు దేశబోయిన వీరమల్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. 1995–96బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఈ ఉత్సవాలకు రూ.10లక్షలు విరాళం ప్రకటించినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడిపై దాడి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సప్పిడి రంజిత్‌పై కొందరు వ్యక్తులు దాడిచేసి గాయపర్చిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడి తల్లి పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన రంజిత్ ఇంటికి కొందరు వ్యక్తులు వచ్చి రంజిత్ గురించి అడిగారు. ఇంట్లో లేరని కుటుంబ సభ్యులు చెప్పారు. వెంటనే విషయాన్ని కుటుంబ సభ్యులు రంజిత్‌కి ఫోన్ చేసి తెలిపారు. ద్విచక్రవాహనంపై ఎడ్ల ఈశ్వర్ అనే వ్యక్తితో కలిసి రంజిత్ ఇంటికి వస్తున్నాడు. దారిలో హౌసింగ్ బోర్డ్ కాలనీ వద్ద ఐదుగురు వ్యక్తులు రంజిత్‌ను అడ్డుకొని దాడిచేసి గాయపర్చారు. రంజిత్ తప్పించుకుని ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుడి అనుచరులైన యువకులు వంశీ, శేఖర్, లక్ష్మణ్, మరో ఇద్దరు కలిసి రంజిత్‌పై దాడి చేశారని బాధితుడి తల్లి మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టైన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపాడు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని పర్వతగిరి మాజీ సర్పంచ్ చేబెల్లి కట్టయ్య ఇటీవల మృతిచెందగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను ఎంపీ కవిత పరామర్శించారు.

కురవి: మండలంలోని కందికొండ గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్త వెంకన్న(35) మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆదివారం పరామర్శించారు.

ఆడపిల్లలను చంపకండి



చిన్నారుల మృతదేహాలను పరిశీలిస్తున్న ఎల్లమ్మ

గార్ల: ఆడపిల్లలను సాకలేకపోతే పిల్లలను ఐసీడీఎస్ శాఖకు అప్పగిస్తే పిల్లల సంరక్షణ బాధ్యతలు తీసుకుంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.ఎల్లమ్మ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో తల్లితండ్రుల చేతిలో బలైన చిన్నారుల మృతదేహాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల తల్లితండ్రులకు చేతులెత్తి దండం పెడుతున్నా.. దయచేసి ఆడపిల్లలను చంపకండి అని అన్నారు. అంకన్నగూడెంలో ఇద్దరు ఆడపిల్లల మరణానికి కారకులైన తల్లితండ్రులను పోలీసులు కఠినంగా శిక్షించాలన్నారు. త్వరలో గ్రామాల్లో బాలికల ఉజ్వల భవిష్యత్‌కు మహిళా సదస్సులు ఏర్పాటు చేస్తామని ఆమె పేర్కొన్నారు.